## రాజీవ్ హత్యకేసు

# సాయుధ ఉద్యమాలు - ప్రభుత్వ చట్టాలపై ఒక పరిశీలన

- కె. బాలగోపాల్

చట్టం అందరినీ ఒకే రకంగా చూడాలనీ, అందరికీ ఒకే రకమైన రక్షణ కల్పించాలనీ మనకొక ప్రాథమిక హక్కు వుంది. దానికి గల అనేక అర్థాలలో ఒకటేమిటంటే, న్యాయస్థానాలు నేరాలను విచారించేటప్పుడు రాజకీయ ఒత్తిడిలకు లొంగకూడదు. సమాజంలో ఆధిపత్య స్థానంలో వున్న భావాల ప్రభావానికి లోనుగాకూడదు. బయటినుండి వచ్చే ఒత్తిడులనైతే ప్రతిఘటించటం సులభమే. ఎవరైనా జడ్జిగారికి ఫోన్ చేసి, ఫలానా కేసులో ఫలానాతీర్పు నివ్వమని అడిగితే, ''నువ్వెవడివి నాకుచెప్పటానికి'' అని జడ్జిగారు కోపం చేసుకోగలరు. కానీ, జడ్జీల మనస్సులోనే కొన్ని భావాలుంటాయి - కొన్నివిలువలుటాయి. న్యాయమూర్తులుసమాజానికి, రాజకీయాలకు అతీతులు కారు. దాని ప్రభావం గురిచి వారు అప్రమత్తంగా లేక పోతే న్యాయవ్యవస్థ కుండవల్సిన నిష్పాక్షికతకు అర్థం లేదు. న్యాయమూర్తులు సమాజానికి అతీతంగా ఏ పక్షపాతం లేకుండా వుంటారని కాదు. తమ సామాజిక స్థితిగతుతల వల్ల, తమ ఆలోచన రీతి వల్లతమలోవున్న భావాల విషయంలోనూ, పక్షపాతాల విషయం లోనూ వారు అప్రమత్తంగా వుంటారనీ - నిజాయితీగా వాటిని గుర్తెరిగి వ్యవహరిస్తారనీ మాత్రమే.

శ్రీ పెరుంబుదూరు మనవ బాంబు కేసులో (రాజీవ్ హత్యకేసంటే వెంటనే అర్థమవుతుందేమో) విచారణను ఎదుర్కొన్న 26 మందికి చెన్నై టాడాకోర్టు న్యాయమూర్తిమరణదండన విధించటం వెనుక అనేక రాజకీయ భావాల ఒత్తిడి వుందనేది స్పష్టమే. దేశద్రోహం, టెర్రరిజం. వేర్పాటువాదం మొదలయిన మాటలు జడ్జీగారి చెవిలోరొదపెడుతూ వుంటేనే సాధారణ న్యాయశాస్త్ర నియమాలను సైతం వారు మరిచిపోగలుగుతారు. ''అవి నావిధి నిర్వహణకు అక్కరలేని మాటలు- నేను ఇక్కడ ఉన్నది ఒక హత్యకేసును విచారించి ఎవరి పాత్ర ఏమిటో నిర్ధారించి ఉచితంగా, న్యాయశాస్త్ర నియమాలకు లోబడి తీర్పు ఇవ్వడానికి మాత్రమే'' నని న్యాయమూర్తిఅనుకోగలిగితే అంత వికృతమైన తీర్పు ఇచ్చేవారు కాదు. అలా అనుకోలేక పోయారనేది స్పష్టమే.



చనిపోయిన వారిలో రాజీవ్‌గాంధీ ఒకరు కాకపోతే, తమిళనాడుకు చెందిన ఛోటాకాంగ్రెస్ నాయకులే అయివుంటే, ఎల్‌టిటిఇ ప్రస్తావనలేకుండా కేవలం స్థానిక కాంగ్రెస్ ద్వేషులో మరెవరో ఆ ఘోరానికి పాల్పడివుంటే, అసలు దేశరాజకీయాలతో ఆ ఘటనకేమి సంబంధం లేకుండివుంటే, అది రెండు ప్రత్యర్థిముఠాలకొట్లాటలో జరిగిన ఘటన అయి వుంటే - జడ్జిగారు 26 మంది ముద్దాయిలకూ మరణదండన వేద్దురా? ప్రత్యక్షంగా పాల్గొన్న ఒకరిద్దరికిమాత్రమే వేసి మిగిలిన వారికి కారాగార శిక్షతో సరిపెట్టి వుందురా? జవాబు చెప్పడానికి ఎంతోదూరం వెతక నక్కర్లేదు. మరి నేరం అదే అయినప్పుడు, జరిగిన నష్టం ఒకటేఅయినప్పుడు న్యాయ నిర్ణయంలో ఇంత తేడా వుండవచ్చునా ? ఉండేటట్లయితే చట్టం అందరినీ ఒకే రకంగా చూడాలి- అందరికీ ఒకే రకమైన రక్షణ కల్పించాలి అనే ప్రాథమిక హక్కుకు ఏమయినా అర్థమున్నట్లా ?

26 మంది ముద్దాయిలకూ బాంబు పేలుడు కేసులో బాధ్యతగనక వుంటే అందరికీ ఉరిశిక్ష వేయడంలో తప్పేముంది? అని అడగవచ్చు. ఉరిశిక్ష అసలే వేయకూడదనే వారుఒక్కరికి కూడా వేయొద్దంటారు. కానీ భారత న్యాయ శాస్త్రం ఉరిశిక్షను ఆమోదిస్తుంది. దాని ప్రకారం అందరికీ శిక్షవేస్తే తప్పేముంది.?

తప్పేమిటంచే 26 మందీ ఘటనలో ప్రత్యక్షంగా పాల్గొనలేదు - ఒక్కొక్కరి పాత్ర ఒక్కొక్కటి. ఒకరు శుభ, శివరాసన్ తదితరులకు (ప్రధాన పాత్రధారులకు) ముందురోజో, వెనకరోజో ఆశ్రయం ఇచ్చారు.

ఒకరు వాహనం ఏర్పాటు చేసారు. ఒకరు కెమెరా అరువు ఇచ్చారు - ఒకరు ఘటన జరిగిన తరువాత దానిని అక్కడినుంచి తొలగించాలని ప్రయత్నించారు. కొంతమంది మరింత సన్నిహితంగా హత్యాకాండలో పాల్గొన్నారు.

వివిధ రూపాలలో వీరు చేసిన సహాయం ఒక కుట్రలో భాగమనీ, మానవబాంబు ప్రయోగం ద్వారారాజీవ్ గాంధీని చంపడం ఆ కుట్ర లక్ష్యమనీ ఈ 26 మందిపైనా వున్న అభియోగం. వారు చేసిన వివిధ చర్యల నుండి - వారందరి ఉమ్మడి లక్ష్యమైన ఈ కుట్ర రుజువయిందని న్యాయమూర్తిగారు భావించారు. అందువల్ల అదరికీ ఒకే శిక్ష - మరణదండన విధించారు. ఇది సబబేనా ? వేరొక కేసయితే ఇదే న్యాయమూర్తిగారు ఇదే విధంగా ఆలోచించి వుందురా ?

ఎందుకంటే 'కుట్ర' అనేది భారత శిక్షాస్మృతిలోని అత్యంత అస్పష్టమైన నేరాలలో ఒకటి. కుట్రలు ఎప్పుడైనా రహస్యంగానే జరుగుతాయి. కాబట్టి వాటికి స్పష్టమైన సాక్ష్యాధారాలు దొరకడం కష్టమని చెప్పి, పరోక్ష ఆధారాలను కూడా చట్టం అనుమతిస్తుంది. అందరూ కలిసిగానీ, విడివిడిగా గానీ కుట్ర చేసారన్న ప్రత్యక్ష సాక్ష్యమేమీ దొరకకున్నా వారి వారి ప్రవర్తననుబట్టీ, మాటలనూచేతలనూ బట్టీ, వారంతా ఒక ఉమ్మడి లక్ష్యంతో నేరంలో భాగస్వాములయ్యారని కోర్టువారు నమ్మితే 'కుట్ర' రుజువయినట్టేనని చట్టం అంటుంది.

ఇంత అస్పష్టమైన నేరం శిక్షాస్మృతిలో వుండడం సబబేనా అన్నది ఇక్కడ చర్చకాదు. దానికి రెండువైపులా వాదనలు వుండగలవు. ఉదాహరణకు దళితులను చంపిన కేసులలో హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్నవారినేకాక, వెనుక ఉండి కుట్రచేసిన వాళ్ళనూ కూడా ముద్దాయిలుగా పెట్టాలని ఉద్యమకారులే డిమాండ్ చేస్తుంటారు. కానీ అస్పష్టమైన ఆధారాలతో కూడా కుట్ర జరిగిందని నమ్మే అవకాశం చట్టం కల్పించినప్పుడు, ఆనేరానికి మరణదండన వేయడం ఉచితమా అనేది న్యాయమైన ప్రశ్నే. ఈ అస్పష్టత వల్లనే కోర్టులు సాధారణంగా కుట్ర జరిగిందనే సంగతి నేరుగారుజువయితే తప్ప - కుట్రదారులకు తక్కువ శిక్షవేస్తాయి శ్రీపెరుంబదూరులో



చనిపోయిన వారిలో రాజీవ్‌గాంధీ ఒకరుకాకుంటే, చెన్నై టాడా కోర్టు జడ్జీ కూడా తక్కువే వేసి వుండేవారు ఎందుకంటే ఆ ఘటనలో ఈ 26 మందీ కుట్ర చేసారన్న ప్రత్యక్ష సాక్ష్యమేమి లభ్యంకాలేదు. వారి ప్రవర్తనను బట్టీ, ఇతర పరోక్షసాక్ష్యాలను బట్టీ, 'కుట్ర' జరిగిందని న్యాయమూర్తి నమ్మారు. వేరేకేసయితే, ఈ పరోక్ష ఆధారాలతో వారినిఅందరినీ ఉరితీయటం సబబు కాదని జడ్జిగారికే అనిపించి వుండేది.

మరొక విషయం -ఈకేసును విచారించింది 'టాడా' కింద. 1995 లోనే టాడా కు కాలం చెల్లిపొయిందిగానీ, పాత టాడా కేసుల విచారణమాత్రం కొనసాగుతుందని అప్పటి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. శ్రీ పెరుంబుదూరు కేసు వాటిలో ఒకటి. టాడాను ప్రభుత్వమే వదులుకోవడానికి గల కారణాలలో ఒకటి ఏమిటంటే, ఆచట్టం నిర్దేశించే నేరవిచారణా పద్ధతి చాలా అప్రజాస్వామిక మైనది. ఉదాహరణకు ఎస్.పి. స్థాయి పోలీసు అధికారికి ముద్దాయి ఇచ్చిన ఒప్పుకోలు టాడా కోర్టులో సాక్ష్యంగా చెల్లుబటుఅవుతుంది. శ్రీ పెరుంబుదూరు కేసులోని ప్రధాన సాక్ష్యాలన్నీ ఇటువంటి 'ఒప్పుకోళ్ళే' అప్రజాస్వామికమని ప్రభుత్వమే ఒప్పుకొని వదులు కున్న చట్టంలోని అత్యంత అప్రజాస్వామిక అంశం ఆధారంగా రుజువు అయిన నేరానికి ప్రాణం తీసే మరణదండన విధించడం సబబా ?

ఏ కొంచెం సందేహం ఉన్నా మరణశిక్ష వేయకూడదనేది భారత న్యాయశాస్త్రం (సుప్రీంకోర్టు తీర్పుల పుణ్యాన) ఆమోదించే సూత్రం. అస్పష్టమైన 'కుట్ర' అనే నేరానికి పాల్పడినట్టు అప్రజాస్వామికమైన 'ఒప్పుకోలు' సాక్ష్యం ద్వారా 'రుజువు' చేసి, ఉరితీయడం - ప్రజాతంత్ర సూత్రాల సంగతి అటుంచి భారత న్యాయశాస్త్రం దృష్టిలో కూడా సమర్థనీయం కాదు.


రాజీవ్ గాంధీ తల్లిగారి హత్యకేసులో కూడా ఇటువంటి అన్యాయమే జరిగింది. ఆమె హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న సత్వంత్ సింగ్, బియాంత్ సింగ్‌లలో ఒకరు అప్పటికప్పుడే జరిగిన ఎదురు కాల్పులలో చనిపోయారు. రెండవ వ్యక్తితోబాటు మరిద్దరుకుట్ర దారులకు కూడ ఢిల్లీ సెషన్స్ కోర్టు ఉరిశిక్ష విధించగా, వారిద్దరిలో ఒకరిని మాత్రమే సుప్రీంకోర్టు విముక్తుడిని చేసింది. రెండవ వ్యక్తిని - కేహార్‌సింగ్‌ను ఉరితీయడం సబబేనని సుప్రీంకోర్టు సహితం భావించింది. అతనిని ఉరితీయడమూ జరిగింది. నిజానికి సత్వంత్‌సింగ్, బియాంత్ సింగ్‌లతో కలిసి కేహార్‌సింగ్ ఇందిరాగాంధీ హత్యకు కుట్ర చేసాడని నమ్మడానికి ఉన్న ఆధారం చాలా అస్పష్టమైనది. ఆ ఇద్దరూ కేహార్‌సింగ్ ఇంటికి వచ్చారనీ, అతని భార్యాపిల్లలకు వినపడకుండా ఏదో మాట్లాడుకున్నారనీ, కేహార్‌సింగ్ భార్య అడిగితే జవాబుచెప్పలేదనీ రుజువయింది. ఇందిరాగాంధీ హత్యకేసులో కేహార్‌సింగ్ కుట్రదారుడని నమ్మడానికి ఇది సరి పోతుందని ట్రయల్ -కోర్టేకాదు, సుప్రీంకోర్టు సహితం నమ్మింది. పైగా ఈపాటి సాక్ష్యాలతో అతనిని ఉరితీయడం సబబని కూడా నమ్మింది.

ఇప్పుడు ఒక కేహార్‌సింగ్ కాదు - రెండు డజన్ల కేహార్‌సింగ్‌లు చెన్నై సెంట్రల్ జైలుడెత్ సెల్‌లో చావుకోసం ఎదురుచూస్తూవున్నారు. అప్పుడూ, ఇప్పుడూ న్యాయం ఇంత నిర్దయగా వుండటానికి కారణం ఒక్కటే. వాళ్ళ చర్యల ఫలితంగా ఈ దేశాన్ని అందరికంటే ఎక్కువ కాలం ఏలిన కుటుంబానికి చెందిన ఒకవ్యక్తిచనిపోయారు. ఇది న్యాయవ్యవస్థ అనుసరించకూడని ప్రమాణం. కేహార్‌సింగ్ విషయంలో తన తప్పును సవరించుకోవడానికి తప్పటడుగు వేసినసుప్రీంకోర్టు అవకాశాన్నయినా ఉపయోగించు కుంటుందా ?

కోర్టుల సంగతి అటుంచి 'ప్రజాభిప్రాయం' కూడా ఈ ఘోరాన్ని సులభంగానే దిగమింగింది. దేశ సమగ్రత పేరుమీద, వేర్పాటువాదాన్ని ఎదుర్కోటం పేరుమీద, టెరరిజాన్ని తిప్పికొట్టే పేరుమీద ఏంచేసినా గుడ్డిగా ఆమోదించే వాతావరణం భారతదేశంలో కొంత కాలంగా నెలకొని వుంది. అంతా వివరించి చెప్తే, 'నిజమే, అన్యాయమే' నని ఒప్పుకునేవాళ్ళు లేక పోలేదు. కానీ ఆ ఒప్పుకోలుమనస్సులోతులనుండి రాదు. ఆ అన్యాయాన్నిగట్టిగా వ్యతిరేకించాలన్నసంకల్పం ఉండదు. అందుకే భారతసైన్యం కాశ్మీర్‌లో అంతటి ఘోర మారణకాండను దాదాపుఎనిమిదేళ్ళుగా కొనసాగించ గలుగుతున్నది.

ఎల్.టి.టి.ఇ. వంటి సంస్థలు - వారొక్కరేకాదు- చేపట్టే విపరీత హింసాకాండ ఈ అప్రజాస్వామిక వాతావరణాన్ని పెంచుతోంది. తిరిగి సమాజం ఇంత అప్రజాస్వామికంగా వున్నప్పుడు మాకుగత్యంతరమేముంది అని మరింత హింస చేయడాన్ని వారు సమర్థించు కుంటారు. దుర్మార్గుడని తాము ఎండగట్టిన ఒక వ్యక్తిని చంపడం ఒకెత్తు. అప్పుడు కనీసం ఆ హింసకు నైతికంగాబాధ్యులెవరూ ? ఎవరిని తప్పుపట్టాలి ? అనే చర్చ సమాజంలో జరుగుతుంది. ఆ హత్యకు పాల్పడినవారున్యాయం పొందడానికి వేరే చట్టబద్ధమైన మార్గం లేక ఈ నేరానికిపాల్పడ్డారుకాబట్టి, తప్పంతా వారి మీదే నెట్టి, వారినే కఠినంగా శిక్షించాలనడంలో అర్థం లేదని వాదించడానికీ, నేరం, సమాజం, శిక్ష వం మొదలయిన విషయాల గురించి సమాజాన్ని హేతుబద్ధంగా ఆలోచింపజేయడానికీ అస్కారం వుంటుంది.

కానీ - కారుబాంబుల రూపంలోనూ, మానవబాంబుల రూపంలోనూ జరిపే మూకుమ్మడి మారణకాండ నేరాన్ని గురించీ, నైతిక బాధ్యత గురించీ హేతుబద్ధమైన వివేచననూ, సున్నితమైన ఆలోచననూ రేకెత్తించకపోగాప్రజాలలో అభద్రతను పెంచుతుంది. రాజకీయాల గురించీ, పోరాటాల గురించి ప్రజలు వివేచనాత్మకంగా ఆలోచించగలవాతావరణాన్ని పెంపొందించక పోగా హింస, వేర్పాటు, దేశం వచ్చిన్నం మొదలైన మాటల బెదిరింపులతోవివేచనను చంపేసి, ఈపరిస్థితితలెత్తడానికి తమ బాధ్యత ఏమిటని ఆత్మ పరీక్షచేసుకోకుండా అణచివేతతో శ్మశాన శాంతి నెలకొల్పాలని చూసే పాలకుల



విధానాలకు అనుకూలమైన వాతావరణాన్ని పెంపొందిస్తుంది. చావుపట్ల మనుషులలో ఉండవలసిన సున్నితమైన స్పందనను చంపేస్తుంది. ఆ తర్వాతఆ పోరాటకారులకే కోర్టులలోనయినా బయటయినా అన్యాయం జరిగితే స్పందించాడానికి కావలసిన సున్నితత్వం సమాజంలో మిగలదు.

తప్పంతా ఎల్.టి.టి.ఇ. మీదనో, ఇతర సాయుధ పోరాటకారుల మీదనో పెట్టడానికి ఈ మాటలు అనడం లేదు. వాళ్ళ ఉపయోగిస్తున్న పద్ధతుల సామాజిక పర్యవసానాల గురించి వారిని ఆలోచింప చేయడం అవసరం. వాళ్ళ తప్పొప్పులెట్లాగున్నా, న్యాయాన్యాయల గురించి ప్రజాస్వామికంగా ఆలోచించే వాతవరణాన్ని సజీవంగా ఉంచడం కోసం మనం కృషి చేయవలసిన అవసరం చాలా వుంది. ఎల్.టి.టి.ఇ. కర్కశత్వాన్ని గురించీ క్రూరత్వాన్ని గురించీ రెండు అభిప్రాయాలకు తావులేదు గాని, శ్రీలంక ఉత్తరభాగానవున్న తమిళులలో జాతీయకాంక్ష బలంగా వున్నమాట వాస్తవం. ఎల్.టి.టి.ఇ. తన పద్ధతితో దానికి కట్టుబడి వుందనేదీ వాస్తవం. ఈ తమిళ జాతీయ ఆకాంక్షలో భారతపాలకులు (ముఖ్యంగా ఇందిరాగాంధీ, ఆమె తనయుడు) నిస్సిగ్గుగా ఆడుకున్నారనేది కూడాసత్యం.

ఒక దశ వరకూ ఎల్.టి.టి.ఇ. కి తమిళనాడు రాష్ట్రంలోనే క్యాంపులు పెట్టి సైనిక తర్ఫీదు ఇచ్చారు. శ్రీలంక తమిళ జాతీయ వాదాన్ని న్యాయమైన రాజకీయ కాంక్ష అని సమర్థించారు. ఆ తరువాత ప్లేటు ఫిరాయించి శ్రీలంక ప్రభుత్వంతో ఒప్పందం చేసుకొని శాంతి నెలకొల్పే పేరిట భారత సైన్యాన్ని జాఫ్నాలో దించి తమిళులనూ ఎల్.టి.టి.ఇ. గెరిల్లాలనూ ఊచకోత కోయించారు. దీనితోఎల్.టి.టి.ఇ. నాయకులలో పెరిగిన ఆగ్రహమే చివరికి శ్రీపెరంబుదూర్ మారణకాండకు దారి తీసింది. ఈ చరిత్రను మరిపింపచేసి తప్పంతా వేలు పిళ్ళై ప్రభాకరన్ మీద పెట్టటానికి వీలులేదు. జైన్ కమీషన్ నివేదికపైన జరిగిన గందరగోళంలో ఈ ప్రయత్నమే ఉంది. ఇప్పుడు 26 మందికి ఉరిశిక్ష వేసి టెర్రరిజంపేరిటదానిని సమర్థించుకునేందుకు చేస్తున్న వాదనలలోనూ ఈ ప్రయత్నమే ఉంది. న్యాయస్థానాలు సహితం దీనికి అతీతం కాదు. ప్రజాస్వామిక వాదులుఈ బూటకాన్ని సాగనివ్వడానికి వీలులేదు.

ఉరిశిక్ష గురించి చట్టపరంగానూ, ప్రజాస్వామ్యవిలువల పరంగానూ, వాదించి సమాజాన్ని ఆలోచింపచేయడం ఎంత అవసరమో, ఎల్.టి.టి.ఇ.వంటి సాయుధ పోరాట సంస్థలకు తమ విచ్చలవిడి హింసాకాండకు ఉండే పర్యవసానాలను ఎత్తిచూపడం ఎంత అవసరమో, భారత పాలకుల రాజకీయ బూటకాన్ని బహిర్గతం చేయడం కూడా అంతే అవసరం.